క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



రామారెడ్డి : అన్నారం గ్రామంలోని చెరువులో నుండి ఉపాధి కూలీలు తీస్తున్న ఫిష్ పాండ్‌ను రామారెడ్డి ఎంపీడీవో సవిత, ఉపాధి హామీ ఏపీవో ధర్మారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఎండ తీవ్రతకు కూలీలు జాగ్రత్తలు పాటించాలని, కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



మద్నూర్(జుక్కల్) : అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకోని మండల కేంద్రంలోని పాత బస్టాండ్‌లో మంగళవారం అగ్ని ప్రమాదాలపై ఫైర్ సిబ్బంది అవగహన కల్పించారు. అగ్నిమాపక శకటం పనితీరును, మంటలను ఆర్పివేసే విధానాన్ని సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ వినోద్‌కుమార్, లీడింగ్ ఫైర్‌మెన్ నర్సింలు, గ్రామస్తులు, అగ్నిమాపక సిబ్బంది ఉన్నారు.

పాఠశాలకు ఆర్థికసాయం



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని బొమ్మన్‌దేవ్‌పల్లిలో ప్రాథమిక పాఠశాలకు వసతుల కల్పన కోసం రూ.2.5లక్షల ఆర్థికసాయం అందించిన జోసాలుకాస్ ప్రతినిధులను ఎంఈవో నాగేశ్వరరావు అభినందించారు. పాఠశాలకు డెస్కులు, ఇతర సామగ్రి కోసం వారు ఆర్థికసాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జోసలుకాస్ మేనేజర్ స్మితేష్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు గునిగెరి హన్మాండ్లు, కాంప్లెక్స్ హెచ్‌ఎం చందర్, బొమ్మన్‌దేవ్‌పల్లి హెచ్‌ఎం రాజు, ఉపాధ్యాయులు భూషణ్ ఉన్నారు.

ఇంటింటా బీజేపీ ప్రచారం



బాన్సువాడ : మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రధాని మోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ఎంపీ బీబీ పాటిల్‌కు ఓటేసి మళ్లీ ప్రధానిని చేయాలన్నారు. బీర్కూర్ మండల అధ్యక్షులు సాయికిరణ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ



భిక్కనూరు : మండలకేంద్రంలో పలు చోట్ల ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు భిక్కనూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఉపాధి పనులు జరిగే ప్రదేశాలకు భిక్కనూరు పీహెచ్‌సీ సిబ్బంది ఆశ వర్కర్లు వెళ్లి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందజేశారు.

కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి




రాజంపేట : జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి అన్నారు. మంగళవారం రాజంపేట మండలంలోని ఆర్గొండ గ్రామంలోని రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో మండల కమిటీ సభ్యులు, గ్రామ అధ్యక్షుడు, యూత్ అధ్యక్షులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా బూత్‌స్థాయి ఏజెంట్లను, ఇన్‌చార్జీలను నిర్ణయించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ కి వచ్చిన మెజారిటీకి రెట్టింపు మెజారిటీ సురేష్ షట్కార్‌ను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు సల్మాన్, మండల ఉపాధ్యక్షులు భీమరి శ్యామయ్య, శ్రీధర్, బస్సీ తదితరులున్నారు.

రాములోరి కల్యాణానికి ముస్తాబు

కామారెడ్డి రూరల్ : శ్రీరామనవమి సందర్భంగా బుధవారం ఉత్సవాలు నిర్వహించేందుకు మండలంలోని ఆయా గ్రామాల్లో పలు ఆలయాలను ముస్తాబు చేశారు. దేవస్థానాల వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ మండపాల వద్ద ఏర్పాటు చేసిన కల్యాణ మండపాల వద్ద పందిళ్లు వేశారు. టెంట్లు, చలువ పందిళ్లు వేశారు. మండలంలోని అడ్లూర్ గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, చిన్నమల్లారెడ్డి, దేవునిపల్లి, క్యాసంపల్లి, గర్గుల్, ఉగ్రవాయి, గ్రామాల్లో ఆలయాలను ముస్తాబు చేశారు.

కల్యాణానికి పట్టువస్త్రాలు అందజేత

భిక్కనూరు : మండలకేంద్రంలోని నగరేశ్వరాలయంలో ఈనెల 17న నిర్వహించనున్న సీతారాముల కల్యాణానికి దోమకొండ మండలం ముత్యంపేటకు చెందిన హన్‌మాన్ స్వాములు పట్టువస్త్రాలను మంగళవారం బహూకరించారు. ముత్యంపేట హన్‌మాన్ గురుస్వాములు అంజిరెడ్డి, పవన్‌గౌడ్ ఆధ్వర్యంలో హన్‌మాన్ స్వాములు సీతారాముల విగ్రహాలకు పూజ చేసి పట్టువస్త్రాలను బహుకరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి గంగెల్లి మధుసూదన్, కోశాధికారి కొడిప్యాక అంజనేయులు ప్రతినిధులు రమేష్, జగదీశ్వర్ పాల్గొన్నారు.



ఎల్లారెడ్డి పట్టణంలోని రామాలయం ఆవరణలో పందిరి

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలోని రామాలయం శ్రీరామనవమికి ముస్తాబైంది. బుధవారం రామాలయంలో సీతారాముల కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం ఎడ్లబండ్ల ప్రదర్శన, ఈనెల 22న రథోత్సవం ఉంటుందన్నారు.

దోమకొండలో..

దోమకొండ : మండల కేంద్రంలోని శివరాంమందిర్ ఆలయంలో బుధవారం జరుగనున్న శ్రీరామనవమికి ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆలయకమిటీ చైర్మన్ రాజు తెలిపారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు పూజలు ఉంటాయన్నారు. మధ్యాహ్నం స్వామివారి ఎదుర్కోలు, సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహి స్తామన్నారు. అన్నదానం ఉంటుందన్నారు.



భిక్కనూరులో పట్టువస్త్రాలను అందజేస్తున్న స్వాములు



దోమకొండలో..



అడ్లూర్‌లో..

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించండి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో కలసిమెలిసి పనిచేసి రాబోయే పార్లమెంటు ఎన్నికలలో బీజేపీని గెలిపించాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఎల్లారెడ్డి నియోజకవర్గం ఇంచార్జీ బానాల లక్ష్మారెడ్డి అన్నారు. తాడ్వాయి మండల కేంద్రంలోనిపార్టీ కార్యాలయంలో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. గ్రామల్లో పర్యటించారు. బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్‌ను భారీ మెజార్టీతో గెలిచేలా కృసిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అద్యక్షుడు సంతోష్‌రెడ్డి, నాయకులు లింగారావు, వెంకట్‌రావు, రవీందర్‌రావు, విఠల్, తిరుపతిరెడ్డి, హోటల్ శ్రీనివాస్ తదితరులున్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బాణాల లక్ష్మారెడ్డి

చలివేంద్రం ఏర్పాటు



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి బస్టాండ్ ఆవరణలో మంగళవారం ఫ్లవర్ షాప్ యజమాని ఇస్మాయిల్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బస్టాండ్‌లోని ప్రయాణికులతో పాటు ఇతరులకు దాహార్తిని తీర్చేందుకుగాను చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు ఇస్మాయిల్ తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

భిక్కనూరు : కాంగ్రెస్ పార్టీలోకి బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు భారీగా మంగళవారం చేరారు. భిక్కనూరు మండల కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సమక్షంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన 389 మంది కాంగ్రెస్‌లో చేరారు. వీరందరికి షబ్బీర్ అలీ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ముఖ్యులు మాజీ ఎంపీపీ తొగరి సుదర్శన్, డీసీసీబీ డైరెక్టర్లు కిష్టాగౌడ్, సిద్దరాములు, పెద్దమల్లారెడ్డి విండో మాజీ చైర్మన్ సంతోషుప్తా, ఇసన్నపల్లి మాజీ సర్పంచ్ రాములు, జంగంపల్లి బీఆర్‌ఎస్ నాయకుడు రాజు కాచాపూర్ బీఆర్‌ఎస్ సీనియర్ నేత జాంగారి కిష్టారెడ్డితో పాటు పలు గ్రామాలకు చెందిన నేతలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్, ఎంపీపీ జాంగారి గాలిరెడ్డి,నేతలు ఇంద్రకరణ్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, కుంట లింగారెడ్డి, బల్యాల సుదర్శన్, బీంరెడ్డి, బల్యాల రేఖ, కుంట లింగారెడ్డి తదితరులున్నారు.



పార్టీలో చేరుతున్న మాజీ ఎంపీపీ సుదర్శన్

శుద్ధి చేసిన ఉప్పనే వాడాలి



కామారెడ్డి టౌన్ : శుద్ధీకరణ చేసిన అయోడిజైడ్ ఉప్పునే వాడాలని కామారెడ్డి ప్రభుత్వ అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి ఈశ్వరి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బతుకమ్మ కుంట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. ఉప్పు వ్యాధిలోపం, రుగ్మతల నివారణపై అంశాలను వివరించారు. విద్యార్థుల గృహాల్లో వంటకాల్లో వాడుతున్న ఉప్పును పరీక్షించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ పి వెంకటరమణ, ఆరోగ్య కార్యకర్త రేణుక, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పైప్‌లైన్లలో లీకేజీలు అరికట్టాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి, పంచాయతీరాజ్ డీఈ వీరనందురావు పేర్కొన్నారు. తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. అధికారులు గ్రామాల్లో పర్యటించి తాగునీటి సమస్యలున్న గ్రామాలను గుర్తించాలన్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్లలో లీకేజీలు తొలగించాలన్నారు. సమస్య తీవ్రమైతే ట్యాంకర్ల ద్వారా నీళ్లు సరఫరా చేయాలన్నారు. తాడ్వాయితో పాటు ఎర్రాపహాడ్, సంగోజివాడి గ్రామల్లో తాగునీటి సమస్య నా దృష్టికి వచ్చిందని, కార్యదర్శులు ప్రతిరోజు ఉదయం 8గంటల్లోపు వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఏవో శ్రీకాంత్, మండల పశువైద్యాధికారి రాంచంద్రం, ఎంఈవో రామస్వామి, ఏపీఎం రవీందర్, ఎంపీవో హెప్సిపారాణి తదితరులున్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వీరనందురావు

సమాచారం..

19న మండల సర్వసభ్య సమావేశం

మాచారెడ్డి : మాచారెడ్డి మండల సర్వ సభ్య సమావేశాన్ని ఈ నెల 19న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గోపి బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు అధ్యక్షతన ఉదయం 11గంటలకు నిర్వహించనున్న మండల సభకు ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

25న బేతాళస్వామి జాతర

బాన్సువాడ : ఈనెల 25న బాన్సువాడలో బేతాళస్వామి జాతర నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు మాసాని శ్రీనివాస్‌రెడ్డి, గుడాల నగేష్ తెలిపారు. మంగళవారం బాన్సువాడ మున్సిపాలిటీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన వారు మాట్లాడారు. ప్రతీ ఏడాది నిర్వహించే బేతాళస్వామి జాతరను ఈ ఏడాది ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 25న ఎడ్ల బండ్ల ప్రదర్శన, 26న కుస్తీ పోటీలు, 27న జాతర ముగింపు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, మట్ల సాయిలు, దాసరి శ్రీనివాస్, దాసరి గంగాధర్, డాకయ్య, మాసాని రవీందర్‌రెడ్డి, మొండి అబ్బయ్య తదితరులు ఉన్నారు.

మహిళ డిగ్రీ కళాశాలలో ఫేర్‌వెల్

రామారెడ్డి : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి (మర్కల్) ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తృతీయ సంవత్సరం విద్యార్థులకు మంగవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి రాధిక, వైస్ ప్రిన్సిపల్ వి రేణుక, అకడమిక్ కో ఆర్డినేటర్ కే వనజ అధ్యాపకులు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు వివిధరకాల సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. మిస్ ఫేర్‌వెల్‌గా శ్రీహిత, ఫస్ట్ రన్నరప్‌గా నందిని గెలుపొందారు. వీరిని కిరీటంతో ప్రిన్సిపల్ డాక్టర్ వి రాధిక సత్కరించారు.



పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

నీటి ఎద్దడి లేకుండా చూడాలి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నస్రుల్లాబాద్ మండల పరిధిలో తాగునీటి సమస్య లేకుండా చూడాలని మండల స్పెషల్ ఆఫీసర్ సతీష్ యాదవ్ అన్నారు. మండలంలోని నాచుపల్లి, దుర్కి గ్రామాల్లో ఎంపీవో రాముతో కలిసి పర్యటించారు. జీపీ కార్యదర్శులతో సమస్యలపై వాకబు చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశ్వినితో చర్చించి నీటి సమస్యను గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

గర్గుల్, ఇస్రోజీవాడిలో..

కామారెడ్డి రూరల్ : గ్రామాల్లో వేసవి కాలంలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీవో మలహరి సూచించారు. మంగళవారం ఆయన మండలంలోని గర్గుల్, ఇస్రోజీవాడి గ్రామంలో పర్యటించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్, గ్రామ కార్యదర్శులు శోభ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్): తండాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని మండల ప్రత్యేక అధికారి విజయభాస్కర్‌రావు సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మండల ప్రత్యేక అధికారి సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో గంగాధర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుమలత, మండల పంచాయతీ అధికారి యాదగిరి, పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.



నీటి సరఫరాను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ సతీశ్

మద్నూర్ ప్రత్యేకాధికారిగా రాణి



మద్నూర్(జుక్కల్) : మద్నూర్ మేజర్ జీపీ స్పెషల్ ఆఫీసర్‌గా పరుచూరి రాణి నియామకమయ్యారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో మంగళవారం జీపీ కార్యదర్శి సందీప్, సిబ్బంది, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరాస్ సాయిలు, నాయకులు నూతన స్పెషల్ ఆఫీసర్‌కు ఘనంగా సన్మానించారు. గతంలో ఇక్కడ స్పెషల్ ఆఫీసర్‌గా పని చేసిన మేనూర్ పశువైద్య అధికారి బండివార్ విజయ్‌ను బీర్కూర్ మండలానికి డిప్యూటేషన్‌పై వెళ్లడంతో మద్నూర్ ఎంపీడీవోగా పని చేస్తున్న పరుచూరి రాణిని ఉన్నతాధికారులు ప్రత్యేక అధికారిగా నియమించినట్లు ఆమె తెలిపారు.

ఓటు వజ్రాయుధం



ఎల్లారెడ్డి : ఓటు వజ్రాయుధం లాంటిదని దీని ద్వారా సమర్థుడైన నాయకుడిని ఎన్నుకోవచ్చని ఆర్డీవో ప్రభాకర్ అన్నారు. మంగళవారం మోడల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఓటు హక్కు గురించి అవగాహన కల్పించారు. 18 ఏళ్లు దాటిన వారు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఓటు హక్కు వచ్చిన వారు తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేందర్ కుమార్, ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్, ఎంఈవో వెంకటేశం తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

శబరి ఆశ్రమానికి పాదయాత్ర




తాడ్వాయి(ఎల్లారెడ్డి) : అదిలాబాద్‌బాద్ ఉమ్మడి జిల్లా నుంచి భక్తులు తాడ్వాయి మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమం వరకు పాదయాత్రగా వచ్చారు. అదిలాబాద్, నిర్మల్ జిల్లాలోని గ్రామాలకు చెందిన భక్తులు, మహారాష్ట్ర సరిహద్దులో ఉన్న గ్రామాలకు చెందిన సుమారు 350మంది భక్తులు తమ గ్రామాల నుంచి పాదయాత్రగా బయలుదేరారు. నిర్మల్ తదితర ప్రాంతాల నుంచి కూడా భక్తులు వచ్చారు. 23 ఏళ్ల నుంచి ప్రతి ఏడాది సుమారు 250 కి.మీ దూరం ప్రయాణిస్తామని వారు పేర్కొన్నారు. మంగళవారం వారికి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు.

సరస్వతి ఆలయంలో పూజలు

కామారెడ్డి రూరల్ : ఇల్చిపూర్‌లోని సరస్వతి మాత ఆలయంలో మంగళవారం కామారెడ్డి పట్టణానికి చెందిన తెలంగాణ రాష్ట్ర శ్రీశైవ క్షేత్ర వనితాశక్తి 7, 11 గ్రూపులకు చెందిన మహిళలు కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు దత్తాద్రిశర్మ, సందీప్‌పాండేల ఆధ్వర్యంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు చేశారు. కుంకుమ అర్చన, లలితా సహస్రపారాయణం చేశారు.

ఈనెల 18న రథోత్సవం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండలంలోని ఎర్రాపహాడ్‌లో ఈనెల 18వ తేదీన రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. శ్రీరామ నవమి సందర్భంగా శ్రీరాజరాజేశ్వరాలయంలో ఈనెల17వ తేదీన సీతారామ కల్యాంణం జరుగుతుందని తెలిపారు. 18న రథోత్సవం, 19న చక్కరి తీర్థం ఉంటుందన్నారు.



బగళాముఖి అమ్మవారి జన్మదిన వేడుకలు

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : పట్టణంలోని బగళాముఖి అమ్మవారి పీఠంలో అమ్మవారి జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. చైత్రమాసంలోని అష్టమిని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో జ్యోతిష్య పండితులు క్రాంతికుమార్, పీఠం సభ్యులు విఠల్, సతీష్, రేవంతప్ప, శైలేందర్ తదితరులున్నారు.



అఖండ హరినామ సప్తాహం ప్రారంభం



బాన్సువాడ రూరల్ : గ్రామంలోని రుక్మిణి విఠలేశ్వర శివపంచాయతన మహాసరస్వతి విగ్రహ శిఖర ప్రతిష్ఠాపనలో భాగంగా మంగళవారం అఖండ హరినామ సప్తాహం ప్రారంభించారు. ఈనెల 22 వరకు కొనసాగుతుందని గ్రామస్తులు తెలిపారు. తొలిరోజు వామన్‌రావు మహరాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగుతాయని సద్గురు మాణిక్ ప్రభు భజన మండలి సభ్యులు కోరారు.

ఘనంగా అంబబాయమ్మ పండుగ



బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లంలో నూతనంగా నిర్మించిన అంబబాయమ్మ ఆలయాన్ని ఈనెల 12న ప్రారంభించగా, మంగళవారం గ్రామస్తులు అంబబాయమ్మ గుడి వద్ద ప్రత్యేక పండుగ నిర్వహించారు. కులసంఘాల ఆధ్వర్యంలో నైవేద్యాన్ని తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గూల ఎర్ర పోచవ్వ, సత్యవ్వ, సందీప్, దామరంచ సాయిలు, ప్రణీత్‌తో పాటు గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవుడికి సిందూర పూజలు



రామారెడ్డి : ఇసన్నపల్లి(రామారెడ్డి) కాలభైరవుడి ఆలయంలో మంగళవారం పర్వదినం సందర్భంగా స్వామి వారికి సిందూర పూజలు జలాభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి కాలభైరవ నామస్మరణతో భజన పాటలను భక్తులు ఆలపించారు. అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభుగుప్తా, ఆలయ అర్చకులు శ్రీనివాస శర్మ, వంశీకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ సురేందర్, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

చైర్‌పర్సన్‌కు సన్మానం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన గడ్డం ఇందుప్రియను మంగళవారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సాప శివరాములు, ప్రతినిధులు భోగ లత, ఎం.మంజుల, సిహెచ్.రాజయ్య, అల్వాల గోపాల్, నాగోజి నారాయణరావు తదితరులున్నారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ



దోమకొండ : మండల కేంద్రంలో కామారెడ్డి డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నీ మంగళవారం రెండవ రోజు కొనసాగింది. రెండోరోజు దోమకొండతో మాచారెడ్డి మండలం వాడి జట్టు తలపడింది. వాడి జట్టు 8 ఓవర్లలో 65 పరుగులు చేయగా, దోమకొండ కేవలం 5 ఓవర్లలో 66 పరుగులు చేసి విజయం సాధించినట్లు నిర్వాహకులు యాదగిరి తెలిపారు. మరో నాలుగు రోజుల పాటు టోర్నమెంట్ ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ



కామారెడ్డి రూరల్ : జాతీయస్థాయిలో నిర్వహించిన ఐఎస్‌టీయస్‌వో ఒలింపియాడ్ పరీక్షలో కామారెడ్డి శ్రీ చైతన్య రామేశ్వర పల్లి రోడ్డు బ్రాంచ్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పరీక్షలో జాతీయ స్థాయిలో మొదటి బహుమతి టాబ్, సెకండ్ ప్రైజ్‌లు గా స్మార్ట్ వాచెస్, కన్సోలేషన్ ప్రైజెస్‌గా బంగారు పతకాలు గెలుచుకున్నారని హెచ్‌ఎం రవితేజ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఏజీఎం జితేందర్, జోనల్ అకడమిక్ కోఆర్డినేటర్ నరేందర్ వైస్ ప్రిన్సిపల్ విమల్ కుమార్ డీన్ సంపత్ కుమార్ ప్రైమరీ ఇన్చార్జ్ హేమలత ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు ఆప్తాల్మిక్ వైద్యులు హరికిషన్ కంటి పరీక్షలు నిర్వహించారు. ప్రిన్సిపల్ కృతమూర్తి, సిబ్బంది ఇందిరా, తదితరులున్నారు.

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మండలంలోని అన్నాసాగర్ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. మత్తమాల పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శరత్ చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు.

జహీరాబాద్ పార్లమెంట్ బరిలో స్వతంత్ర అభ్యర్థి



బాన్సువాడ రూరల్ : జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి జరిగే ఎన్నికల్లో బాన్సువాడ మండలం ఇబ్రాహీంపేట్ గ్రామానికి చెందిన మాలెపు మోహన్‌రెడ్డి పోటీలో ఉండనున్నారు. ఈమేరకు మంగళవారం ఆయన పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి బీ-ఫారం అందుకున్నారు.